ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
వికారాబాద్ - మేడ్చల్
జిల్లాల వార్తలు
5
గురువారం 1 ఫిబ్రవరి 2024

8నుంచి సదరం క్యాంపులు

మేడ్చల్‌టౌన్, జనవరి 31 : ఫిబ్రవరి 8, 15, 22, 29 తేదీల్లో సదరం క్యాంపులను నిర్వహించనున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారి పద్మజారాణి తెలిపారు. ఈ ప్రత్యేక క్యాంపులను మల్కాజిగిరి ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహిస్తున్నారని తెలిపారు. హాజరయ్యే వారు మీసేవా ద్వారా ఆన్‌లైన్‌లో స్లాట్‌బుక్ చేసుకోవాలన్నారు. అనంతరం కేటాయించిన తేదీల్లో ధ్రువీకరణపత్రాలతో మల్కాజిగిరి ప్రభుత్వ ఆసుపత్రికి రావాలని కోరారు.



నేడు పార్లమెంట్‌లో ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టనున్న కేంద్ర తాత్కాలిక బడ్జెట్‌పై ఉమ్మడి జిల్లా వాసులు అనేక ఆశలు పెట్టుకున్నారు. ప్రధానంగా కొత్త రైల్వేలైన్లు, ఎంఎంటీఎస్‌ల పొడిగింపు, బుల్లెట్ రైల్ మార్గాలకు నిధుల కేటాయింపు జరుగుతుందని ఆశిస్తున్నారు. అయితే, వీటికి కేంద్రం ఏ మేరకు సహకరించి నిధులు కేటాయిస్తుందోనన్న ఉత్కంఠ ఇక్కడి ప్రజల్లో నెలకొంది. ఎంఎంటీఎస్ రైళ్ల పొడిగింపు డిమాండ్ ఎన్నో ఏళ్లుగా వస్తున్నా కేంద్రం కనికరించడం లేదు. కనీసం ఈ సారైనా ఉమ్మడి జిల్లావాసుల ఆశలను నెరవేరుస్తుందో.. లేదో చూడాలి.

రెండు బుల్లెట్ రైళ్ల మార్గాలకు నిధులు కేటాయించేనా?

- శంషాబాద్ మెట్రోకు కేంద్రం సహకరించేనా?
- కలగా మారిన ఎంఎంటీఎస్ సేవల పొడిగింపు..
- వికారాబాద్- కృష్ణ రైల్వే పనులకు మోక్షం కలిగేనా?
- హైదరాబాద్- శ్రీశైలం రైలు మార్గంపై గంపెడాశలు



నేడు కేంద్ర తాత్కాలిక బడ్జెట్

ఆకాంక్షలు ఫలించేనా!

కేంద్ర బడ్జెట్‌పై ఉమ్మడి జిల్లావాసుల ఆశలు

(ఆంధ్రజ్యోతి, వికారాబాద్ జిల్లా ప్రతినిధి)

కేంద్ర ప్రభుత్వం నేడు ప్రవేశ పెట్టనున్న తాత్కాలిక బడ్జెట్‌లో సంక్షేమ కార్యక్రమాలతో పాటు రైల్వే పరంగా ఉమ్మడి జిల్లాకు ఈ సారైనా వరాలు కురుస్తాయని ప్రజలు ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నారు. హైదరాబాద్ నుంచి ముంబై, హైదరాబాద్ నుంచి బెంగళూరు వరకు బుల్లెట్ రైళ్ల నిర్మాణ పనులు ఆశించిన స్థాయిలో ముందుకు సాగడం లేదు. ఈ రెండు హైస్పీడ్ రైళ్ల కారిడార్ పనులు మొదలైతే మహానగరాల మధ్య రవాణా సౌకర్యం మరింత మెరుగుపడుతుంది. ముంబై నుంచి హైదరాబాద్ వరకు శరవేగంగా రాకపోకలు కొనసాగించేందుకు నేషనల్ హైస్పీడ్ రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎన్‌హెచ్‌ఎస్‌ఆర్‌సీఎల్) ప్రతిపాదించిన ముంబై - హైదరాబాద్ హైస్పీడ్ రైల్ కారిడార్ ప్రాజెక్టు పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. పర్యావరణ, సామాజిక అనుమతులు పొందడానికి ప్రజాభిప్రాయ సేకరణ ప్రక్రియ పూర్తి చేశారు. హైస్పీడ్ రైల్ కారిడార్ నిర్మాణానికి సంబంధించిన అలైన్‌మెంట్ పనులు చేపట్టేందుకు సిద్ధమైన సమయంలో పనులు నిలిచిపోయాయి. హైస్పీడ్ రైల్ కారిడార్ నిర్మాణానికి సంబంధించిన డీపీఆర్ తయారీ బాధ్యతలను రైల్వే మంత్రిత్వ శాఖ హైస్పీడ్ రైల్ కార్పొరేషన్ లిమిటెడ్‌కు అప్పగించింది. రూ.లక్ష కోట్ల వ్యయంతో ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో హైస్పీడ్ రైల్ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలని ప్రతిపాదించగా, కేంద్ర ప్రభుత్వం ఈసారైనా బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తుందనే ఆశతో జిల్లావాసులు ఎదురు చూస్తున్నారు. అలాగే హైదరాబాద్- ముంబై బుల్లెట్ రైలు నిర్మాణ పనులపై కూడా సందిగ్ధత నెలకొంది. ఇక అనేక సంవత్సరాల నుంచి పెండింగ్‌లో ఉన్న ఎంఎంటీఎస్ సేవల పొడిగింపునకు ఈ సారైనా మోక్షం కలగకపోతుందా అన్న ఆశతో జనం ఉన్నారు. లింగంపల్లి నుంచి వికారాబాద్, తాండూరు వరకు ఎంఎంటీఎస్ రైలు పొడిగించాలని ఆ ప్రాంతాల ప్రజలు డిమాండ్ చేస్తూనే ఉన్నారు. ఎంఎంటీఎస్ సదుపాయం కల్పించాలంటూ 15 ఏళ్లుగా ఈ ప్రాంత ప్రజలు కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఎంపీ, రైల్వే ఉన్నతాధికారులకు వినతిపత్రాలు ఇస్తూనే ఉన్నారు. ఈసారి కేంద్ర ప్రభుత్వం తన బడ్జెట్‌లో వికారాబాద్, తాండూరు మీదుగా కొత్తగా రైళ్లు నడిపించేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇస్తుందనే గంపెడాశతో ఉన్నారు. ప్రస్తుతం జిల్లా మీదుగా రాకపోకలు కొనసాగిస్తున్న రైళ్లు కిక్కిరిసి నడుస్తున్నాయి. ప్రజల డిమాండ్‌కు అనుగుణంగా కొత్త రైళ్లు ప్రవేశ పెట్టడంతో పాటు ప్రస్తుతం కొనసాగుతున్న రైళ్లకు అదనంగా బోగీలు వేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అలాగే అన్ని రైళ్లు తాండూరు, వికారాబాద్‌లో కూడా ఆగే విధంగా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

కొనసాగుతున్న ఫైనల్ లొకేషన్ సర్వే..

ఎంతో కాలంగా ఊరిస్తూ వచ్చిన వికారాబాద్- కృష్ణ రైల్వే మార్గంలో ఫైనల్ లొకేషన్ సర్వే (ఎఫ్ఎల్ఎస్) పనులు కొనసాగుతున్నాయి. వికారాబాద్ నుంచి కృష్ణ వరకు 122 కిలోమీటర్ల దూరం రైల్వేలైన్ నిర్మాణానికి రూ.2,196 కోట్లు ఖర్చవుతాయని అంచనా వేశారు. వికారాబాద్ - కృష్ణ రైల్వేలైన్ కోసం మూడున్నర దశాబ్దాలుగా ప్రజలు ఎదురు చూస్తున్నారు. ఫైనల్ లొకేషన్ సర్వే పనులు పూర్తి కాగానే వికారాబాద్- కృష్ణ రైల్వే లైన్ నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్ లభించనుంది. ఈ మార్గం పూర్తయితే పరిగి, కొడంగల్, హస్నాబాద్, దౌల్తాబాద్, మక్తల్, నారాయణపేట్ మీదుగా సుమారు 40 ప్రాంతాలకు రైలు ప్రయాణం సదుపాయం కలగనుంది.

హైదరాబాద్- శ్రీశైలం రూట్‌కు మోక్షం కలిగేనా?

ఇదిలా ఉంటే హైదరాబాద్- శ్రీశైలం వయా అచ్చంపేట వరకు 171 కి.మీ మేర రైలు మార్గానికి గత ఏడాది రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి ప్రతిపాదనలు పంపింది. వీటిపై కేంద్రం ఇంత వరకు ఎలాంటి నిర్ణయమూ తీసుకోలేదు. ఈ ప్రాజెక్టుకు మొండిచేయి చూపింది. ఈ ప్రాజెక్టు చేపడితే జిల్లాలోని పలు మండలాల ప్రజలకు ప్రయోజనం కలగనుంది.

శంషాబాద్ వరకు మెట్రో విస్తరణకు నిధులిచ్చేనా?

శంషాబాద్ వరకు మెట్రో రైల్ విస్తరణ పనులకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం గచ్చిబౌలిలో శంకుస్థాపన చేసింది. కేంద్రం నిధులు ఇవ్వకున్నా రాష్ట్ర ప్రభుత్వమే దీన్ని నిర్మించాలని నిర్ణయించింది. అయితే ఇపుడు రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో ఈ ప్రాజెక్టును రద్దు చేసింది. గచ్చిబౌలి నుంచి కాకుండా ఎల్బీనగర్, ఓల్డ్‌సిటీ మీదుగా శంషాబాద్ వరకు మెట్రో వేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది. అయితే దీని నిర్మాణ విషయంలో నిధుల సేకరణ ఎలా అనేది ఇంకా రాష్ట్ర ప్రభుత్వం తేల్చలేదు. మెట్రో విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం సహాయం కోరుతోంది. ఇపుడు మారిన మెట్రో విస్తరణ పనులకు కేంద్రం ఎంత వరకు సహాయ సహకారాలు ఇస్తుందో వేచి చూడాలి.



మాట్లాడుతున్న మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

15 లేదా 20న వికారాబాద్‌కు ప్రధాని మోదీ రాక

- మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి

వికారాబాద్, జనవరి 31 : ఫిబ్రవరి 15 లేదా 20వ తేదీల్లో వికారాబాద్ కు దేశప్రధాని నరేంద్రమోదీ రానున్నట్లు మాజీ ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు.. బుధవారం కొండా బాలకృష్ణ గార్డెన్‌లో బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా సేవలందించి పదవీ విరమణ పొందిన సదానందారెడ్డి వీడ్కోలు కార్యక్రమానికి హాజరయ్యారు. అదే విధంగా అయోధ్య నుంచి తీసుకొచ్చిన ప్రసాదాన్ని నాయకులకు అందజేశారు. అంతకు ముందు పదవి విరమణ పొందిన నాయకుడితో పాటు నూతనంగా బాధ్యతలు చేపట్టిన మాధవరెడ్డిని నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. మూడో సారి నరేంద్రమోదీ దేశ ప్రధాని కాబోతున్నారని, రాష్ట్రంలో కూడా బీజేపీ అత్యధిక సీట్లు సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈసారి తప్పని సరిగా చేవెళ్లలో బీజేపీ జెండా ఎగురవేస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శివరాజు, నాయకులు నవీన్ , పాండు గౌడ్, సుచరిత, రాజు పాల్గొన్నారు.

చదువు అనే ఆయుధాన్ని వాడుకోవాలి

కలెక్టర్ నారాయణరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్, జనవరి 31: చదువు అనే ఆయుధాన్ని సక్రమంగా వినియోగించుకోవాలని కలెక్టర్ నారాయణరెడ్డి విద్యార్థులకు హితవు పలికారు. షెడ్యూల్‌కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో పదో తరగతి వసతి గృహ విద్యార్థిని, విద్యార్థులకు బుధవారం వికారాబాద్ పట్టణ కేంద్రంలోని అంబేద్కర్ భవన్‌లో 'ప్రేరణ మరియు శిక్షణ' కార్యక్రమాన్ని నిర్వహించారు. పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు వివిధ పాఠ్యాంశాలపై తర్ఫీదు, మనోధైర్యాన్ని, వ్యక్తిగత నైపుణ్యాన్ని పెంచేందుకు నిష్ణాతులైన ఉపాధ్యాయులు, ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ డైరెక్టర్లచే తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పరీక్షలు సమీపిస్తున్న క్రమంలో విద్యార్థుల్లో భయం, ఉత్సాహం ఉంటుందని తమ లక్ష్యాన్ని సాధించే దిశగా చదువుపై దృష్టి సారించాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ అమిత్ నారాయణ, షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అధికారి మల్లేశం, ఎస్సీ, బీసీ, సంక్షేమ అధికారులు ఉమాపతి, వీరానందం, భీమ్ రాజ్ లతో పాటు ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ డైరెక్టర్లు కె.రామచంద్రుడు, కె .మాధవి, మహేందర్, శ్రీధర్, పీ.వీ రెడ్డి, వివిధ వసతి గృహాల వార్డెన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

మానవ వనరులను సద్వినియోగం చేసుకోవాలి

మానవ వనరులను సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థికంగా ఎదగాలని జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి ఆకాంక్షించారు. జిల్లాలో మహిళా సంఘాల ఆర్థిక పురోగతి, సంఘాల పనితీరు, రుణాల సద్వినియోగంపై వికారాబాద్‌లోని స్త్రీ శక్తి భవన్ లో జిల్లా మహిళా సమాఖ్య సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... స్వయం సహాయక సంఘాల మహిళలు ఆర్థిక ఎదుగుదలతో పాటు సామాజిక సమస్యలపె దృష్టి సారించాలన్నారు. జిల్లా అభివృద్ధిలో భాగంగా వైద్య కళాశాలతో పాటు సూపర్ స్పెషాలిటీఆస్పత్రి, నైపుణ్యాభివృద్ధి (స్కిల్‌డెవలప్మెంట్) యూనివర్సిటీ ఏర్పాటు చేయబోతున్నట్లు కలెక్టర్ తెలిపారు. సమావేశంలో కృష్ణన్ , నర్సింహులు, రామ్నాథ్ నర్సింహులు, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు అలివేలు, కార్యదర్శి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పాలనను సద్వినియోగం చేసుకోవాలి

గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారులుగా ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఎంపీడీవోలు, ఎంపీవోల సహకారంతో ప్రజలకు ఉపయోగపడే విధంగా పనులు చేపట్టాలని కలెక్టర్ నారాయణ రెడ్డి సూచించారు. బుధవారం కలెక్టరేట్‌నుంచి గూగుల్ మీట్ ద్వారా కొత్తగా స్పెషల్ ఆఫీసర్లుగా ఎంపికైన అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించి వారికి దిశ నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పెషల్ ఆఫీసర్లుగా నియామక ఉత్తర్వులు రేపటి వరకు అందించడం జరుగుతుందని, ఉత్తర్వులు అందిన వెంటనే గ్రామపంచాయతీకి సంబంధించిన రికార్డులు, లాగిన్లతో సహా పూర్తి చార్జి ని తీసుకోవాలని సూచించారు. ప్రతి నిర్ణయం ప్రజలకు ఉపయోగపడే విధంగా పూర్తి బాధ్యతతో పనిచేయాలన్నారు.

రూ.100 కోట్ల చెక్కులను సిద్ధం చేయాలి

ఈనెల 5వ తేదీన సీఎం జిల్లా పర్యటన సందర్భంగా డీఆర్‌డీఏ, మెప్మా తరుపున సెల్ఫ్‌హెల్ప్ గ్రూపు మహిళా సంఘాల సభ్యులకు సూక్ష్మ ప్రణాళికలను తయారు చేసి రూ.100 కోట్ల చెక్కులను 4వ తేదీ వరకు సిద్ధం చేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో డీసీసీ/డీఎల్ఆర్సీపై సమీక్ష నిర్వహించారు. జిల్లాలో అన్ని ప్రాధాన్యత రంగాలకు విరివిగా రుణాలు అందించి పూర్తి లక్ష్యాన్ని సాధించాలని బ్యాంకర్లకు సూచించారు. పెండింగ్‌లో ఉన్న ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ రుణాలను ఫిబ్రవరి మాసంతం వరకు అందజేయాలన్నారు. ఈ సందర్భంగా 2024 - 25 ఆర్థికసంవత్సరానికి రూ. 6736.82 కోట్లతో రూపొందించిన ప్రొటెన్షియల్ లింక్‌క్రెడిట్ ప్లాన్ పుస్తకాన్ని కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలోఎల్ డీ ఎం రాంబాబు, ఆర్‌బీఐఎల్‌డీవో యస్ గోపతి, నాబార్డు/డీడీఎం పీయూష్, డీఆర్‌డీవో కృష్ణన్, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి వినయ్ కుమార్, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమశాఖల అధికారులు, పాల్గొన్నారు.

- నేటి నుంచి 15వ తేదీ వరకు..
- మూడు విడతల్లో కొనసాగనున్న పరీక్షలు
- పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

ఇంటర్ ప్రాక్టికల్స్‌కు సర్వం సిద్ధం!

వికారాబాద్, జనవరి31 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : జిల్లాలో ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు ఇంటర్ విద్యా శాఖాధికారులు సర్వం సిద్ధం చేశారు. సోమవారం ప్రారంభమయ్యే ఈ పరీక్షలు ఫిబ్రవరి 15వ తేదీ వరకు కొనసాగనున్నాయి. జిల్లాలో మూడు విడతల్లో 29 కేంద్రాల్లో ప్రాక్టికల్స్ పరీక్షలు జరగనుండగా, మొదటి విడత ప్రాక్టికల్స్ పరీక్షలు ఈనెల ఒకటి నుంచి ఐదవ తేదీ వరకు జరగనుండగా, రెండో విడత పరీక్షలు 6 నుంచి 10వ తేదీ వరకు, మూడవ విడత పరీక్షలు 11 నుంచి 15వ తేదీ వరకు కొనసాగనున్నాయి. మొదటి విడతలో 14 కళాశాలల్లో జనరల్ విద్యార్థులకు, 8 ఒకేషనల్ కళాశాలల విద్యార్థులకు ప్రాక్టికల్స్ పరీక్షలు జరగనున్నాయి. రెండో విడతలో 13 కళాశాలల్లో జనరల్ విద్యార్థులకు, 8 ఒకేషనల్ కళాశాలల విద్యార్థులకు, మూడో విడతలో 13 కళాశాలల్లో జనరల్ విద్యార్థులకు, 8 ఒకేషనల్ కళాశాలల విద్యార్థులకు ప్రాక్టికల్స్‌పరీక్షలు జరగనున్నాయి. జిల్లాలో మొత్తం 81 జూనియర్ కళాశాలలు ఉండగా, వాటిలో జనరల్ కళాశాలలు 67, ఒకేషనల్ కళాశాలలు 14 ఉన్నాయి. జిల్లాలో 4,177 మంది జనరల్ విద్యార్థులు, 2591 ఒకేషనల్ విద్యార్థులు ప్రాక్టికల్ పరీక్షలు రాయనున్నారు. జనరల్ విభాగంలో ద్వితీయ సంవత్సరం విద్యార్థులు, ఒకేషనల్ విభాగంలో మొదటి సంవత్సరం 1352 మంది, ద్వితీయ సంవత్సరం 1,239మంది విద్యార్థులు ప్రాక్టికల్ పరీక్షలకు హాజరు కానున్నారు. జనరల్ విద్యార్థులకు 35 కేంద్రాల్లో, ఒకేషనల్ విద్యార్థులకు 13 కేంద్రాల్లో ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రాక్టికల్ పరీక్షలు జరగనున్న కళాశాలల్లో అవసరమైన సదుపాయాలు కల్పించాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ కళాశాలల ప్రిన్సిపాళ్లు, నిర్వాహకులకు ఆదేశాలు జారీ చేసింది.



విద్యార్థుల వివరాలు	
జనరల్	4,177
ఒకేషనల్	2,591
పరీక్షా కేంద్రాలు	
జనరల్ కేంద్రాలు	35
ఒకేషనల్ కేంద్రాలు	13
మొత్తం	48

తనిఖీ బృందాల నియామకం

ప్రాక్టికల్ పరీక్షలు పరిశీలించేందుకు ఇంటర్మీడియట్ విద్యా మండలి ఉన్నతాధికారులు డెక్‌ను ఏర్పాటు చేశారు. ఇదిలా ఉంటే, ప్రాక్టికల్ పరీక్షల్లో విద్యార్థుల ప్రతిభ ఆధారంగా ఎగ్జామినర్లు మార్కులు వేసే విధంగా ఇంటర్ విద్యాశాఖ అధికారులు నిఘా ఉంచినట్లు సమాచారం. చాలా వరకు విద్యార్థులు చదివిన కళాశాలల్లోనే ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహిస్తుండడంతో ప్రైవేట్ కళాశాలలు తమ విద్యార్థులకు ఎక్కువ మార్కులు వేయించుకునే అవకాశం ఉన్న నేపథ్యంలో ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారులు నిఘా పెంచారు. ఎగ్జామినర్లను ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు ప్రలోభాలకు గురిచేసి తమ విద్యార్థులకు ఎక్కువ మార్కులు వేయించుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్న నేపథ్యంలో ఎగ్జామినర్లు పకడ్బందీగా వ్యవహరించేలా బోర్డు పరీక్షల నియంత్రణ అధికారి ఆదేశాలు జారీ చేశారు.

ప్రాక్టికల్ పరీక్షలపై నిఘా



జిల్లాలో ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు పారదర్శకంగా కొనసాగేలా చర్యలు తీసుకుంటున్నాం. పరీక్షల నిర్వహణకు సంబంధించి పరీక్షా కేంద్రాల నిర్వాహకులకు, ఎగ్జామినర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశాం. ప్రాక్టికల్ పరీక్షల్లో విద్యార్థుల ప్రతిభ ఆధారంగానే మార్కులు వేసే విధంగా చర్యలు చేపట్టాం. అవకతవకలకు పాల్పడితే కేంద్రాల నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

- ఎస్.శంకర్‌నాయక్, ఇంటర్ విద్యా శాఖ జిల్లా నోడల్ అధికారి, వికారాబాద్

పనులు చేయని కాంట్రాక్టర్లపై చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

మేడ్చల్ టౌన్, జనవరి 31 : మేడ్చల్ జిల్లాలో పనులు త్వరితగతిన చేపట్టని కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ గౌతమ్ హెచ్చరించారు. బుధవారం కలెక్టరేట్‌లో అభివృద్ధి పనులపై జిల్లా ప్రణాళిక అధికారి మోహన్‌తో కలిసి పలు శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కాంట్రాక్టర్లు త్వరగా పనులు పూర్తి చేయని పక్షంలో అవసరమైతే వేరే వారికి పనులు చేపట్టే బాధ్యతలు అప్పగిస్తామన్నారు. సీడీఎఫ్, ఎంపీ ల్యాండ్స్, సీబీఎఫ్, ఎన్‌డీఎఫ్ నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనుల గురించి అధికారులతో అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఎంపీల్యాండ్స్ పనులు మార్చి 31లోపు , ఎన్‌డీఎఫ్ నిధులతో చేపడుతున్న పనులు ఫిబ్రవరి నెలాఖరు వరకు పూర్తయ్యేలా చూడాలన్నారు. ప్రజాప్రతినిధులు అభివృద్ధిపనుల కోసం కేటాయించిన నిధులు పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకునే దిశలో అధికారులు పని చేయాలని సూచించారు. అభివృద్ధి పనులపై తిరిగి 15 రోజుల తర్వాత సమీక్ష నిర్వహిస్తామని, వివరాలు తనకు సమర్పించాలన్నారు. అదే విదంగా జిల్లాలోని ఇరిగేషన్, ఆర్‌అండ్ బీ తదితర శాఖలపై సమీక్షించి సంబంధిత శాఖల అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులతో పాటు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

గోవా టూర్‌లో పోచారం మునిసిపల్ పాలకవర్గం

● 'అవిశ్వాస' సమస్య పరిష్కారానికే అని ప్రచారం

ఘట్‌కేసర్, జనవరి 31 : అవిశ్వాస తీర్మాన భయం మున్సిపాలిటీల ఛైర్మను, వైస్‌ఛైర్మన్లను వెంటాడుతోంది. మునిసిపాలిటీల పాలకవర్గాలు కొలువుదీరి నాలుగేళ్లు పూర్తికావడంతో నిబంధనల మేరకు చైర్‌పర్సన్, వైస్ చైర్ పర్సన్లపై అవిశ్వాసాన్ని ప్రవేశపెట్టే వీలు ఉంటుంది. దీంతో చాలా మునిసిపాలిటీల్లో సభ్యులు అవిశ్వాసాలపై దృష్టిసారించారు. రాష్ట్రంలో ఇప్పటికే పలు మున్సిపాలిటీల్లో అవిశ్వాస నోటీసులు ఇచ్చారు. అలాగే కొన్ని అవిశ్వాస తీర్మానాలు నెగ్గి ఛైర్‌పర్సన్లు పదవిని కోల్పోయారు కూడా! దీంతో ఎవరి జాగ్రత్తల్లో వారు నిమగ్నమయ్యారు. మేడ్చల్ జిల్లా పోచారం మున్సిపాలిటీ పాలకవర్గ సభ్యుల్లో కొందరు తమ మునిసిపాలిటీల్లోనూ అవిశ్వాసంపై చర్చించడం ప్రారంభించారు. దీంతో మున్సిపల్ ఛైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి దిద్దుబాటు చర్యలకు శ్రీకారం చుట్టారు. మున్సిపాలిటీలో 18 మంది కౌన్సిలర్లు ఉండగా వారిలో ఒకరు కాంగ్రెస్, మరొకరు బీజేపీ సభ్యులు. మిగిలిన 16 మంది కౌన్సిలర్లు బీఆర్‌ఎస్‌కు చెందినవారే. సొంతపార్టీ వారే అసమ్మతి రాగం వినిపిస్తుండటంతో మరో ఏడాది పాటు పదవిలో ఉండాలంటే కౌన్సిలర్లను బుజ్జగించే కార్యక్రమంలో భాగంగా ఛైర్మన్, వైస్‌ఛైర్మన్ సహా 13 మంది కౌన్సిలర్లు గోవా రాష్ట్రంలో విహారయాత్రకు వెళ్లారు. వారిలో బీజేపీ సభ్యుడు, బీఆర్‌ఎస్‌కు చెందిన 13 మంది సభ్యులున్నారు. కాంగ్రెస్ కౌన్సిలర్, ఒక బీఆర్‌ఎస్ కౌన్సిలర్ విహారయాత్రకు దూరంగా ఉన్నారు. ఛైర్మన్ వర్గానికే చెందిన మరో కౌన్సిలర్ వ్యక్తిగత కారణలతో వెళ్లనట్టు తెలుస్తోంది. మొత్తానికి 15 మంది కౌన్సిలర్లు మూడు రోజులుగా గోవాలో విహరిస్తున్నారు. మెజారిటీ సభ్యులు తన వెంటే ఉన్నందున అవిశ్వాసం సాధ్యం కాదనే ధీమాలో ఛైర్‌పర్సన్ ఉన్నారు. అయితే బేరసారాల్లో విభేదాలు తలెత్తితే పరిస్థితి మొదటికి రాకపోదనే చర్చలు సాగుతున్నాయి. ఒక్క సంవత్సరమే పదవీ కాలం ఉండడంతో భారీగా తాయిలాలు ఇచ్చి ఛైర్మన్ పదవికి ఎవరు ప్రయత్నిస్తారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. గోవా టూర్‌తో అవిశ్వాసం సమసిపోతుందా? లేక తిరగబడుతుందా? అనేది త్వరలోనే తేలనుంది.

ఉద్యోగ విరమణ మధురానుభూతులు మిగులుస్తుంది



మల్లేశం దంపతులను సన్మానిస్తున్న ఛైర్‌పర్సన్, నాయకులు

వికారాబాద్, జనవరి 31 : ఉద్యోగ విరమణ అనే ప్రతీ ఉద్యోగి జీవితంలో మధురానుభూతులను మిగులుస్తుందని వికారాబాద్ మున్సిపల్ ఛైర్‌పర్సన్ మంజుల అన్నారు. బుధవారం వికారాబాద్‌లో గల జిల్లా పరిషత్ పాఠశాలలో ఆఫీస్ సబార్డినేట్ భగిరి మల్లేశం రిటైర్మెంట్ కార్యక్రమానికి ఛైర్‌పర్సన్ ముఖ్య అతిథిగా, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మల్లేశం దంపతులను సన్మానించారు. వారు మాట్లాడుతూ.. ఉద్యోగ విరమణ అనేది ప్రభుత్వ ఉద్యోగులు ప్రతీ ఒక్కరి జీవితంలో ఒక మధురానుభూతి వంటిదన్నారు. మల్లేశం తన సర్వీసులో ఎంతో మంది ఉపాధ్యాయులను, విద్యార్థులను చూసి ఉంటారని, అవన్నీ ఆయన జీవితంలో మధుర జ్ఞాపకాలుగా నిలిచిపోతాయని అన్నారు. కార్యక్రమంలో మాజీ మునిసిపల్ వైస్ ఛైర్మన్ రమేష్, మాజీ జెడ్పీటీసీ ముత్తాహర్ షరీఫ్, కౌన్సిలర్ మురళి, నాయకులు రమేష్‌నాయక్, సర్ఫరాజ్, దీపు, హెచ్‌ఎం గాలి శ్రీహరి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలను నివారించాలి

● ఎస్పీ కోటిరెడ్డి

వికారాబాద్, జనవరి 31 : రోడ్డు ప్రమాదాలను నివారించడం అందరి బాధ్యత అని, మైనర్‌లు వాహనాలు నడిపితే వారి తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని జిల్లా ఎస్పీ కోటిరెడ్డి అన్నారు. 35వ జాతీయ రహదారి భద్రతా ఉత్సవాల సందర్భంగా పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తా నుంచి ఎంఆర్‌పీ పెట్రోల్ పంపు వరకు రోడ్డు భద్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ దేశవ్యాప్తంగా గంటకు సుమారు 400 రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రతి ఒక్కరు బాధ్యత వహిస్తూ తమ పిల్లలకు, చుట్టూ ప్రక్కల వారికి రోడ్డు భద్రతా నియమాలపై అవగాహనా కలిగించాలని సూచించారు. ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకున్నపుడే రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయని చెప్పారు. రోడ్డు ప్రమాదాల వల్ల సంబవించే మరణాలలో ఎక్కువ శాతం ద్వి చక్ర వాహనదారులేనని, హెల్మెట్‌లు ధరించక పోవడమే ప్రధాన కారణమని చెప్పారు. ద్విచక్ర



ఎంఆర్‌పీ చౌరస్తాలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలిని, మద్యం సేవించి వాహనాలు నడుపొద్దని పేర్కొన్నారు. వాహనాల్లో పరిమితిని మించి ప్రయాణికులను తరలించొద్దని, త్రిబుల్ రైడింగ్ చేయవద్దని హెచ్చరించారు. అధికారులు, విద్యార్థులు, సిబ్బందితో రోడ్డు నిబంధనలు పాటించే విధంగా ఎస్పీ ప్రతిజ్ఞ చేయించారు. జిల్లా అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి, ఆర్టీసీ అధికారి జోసెఫ్, డిపో మేనేజర్ భక్షినాయక్, మునిపల్ చైర్‌పర్సన్ మంజుల, అధికారులు, పాల్గొన్నారు.

మునిసిపల్ స్థలాల రక్షణ, పార్కుల అభివృద్ధికి నిధులు

●సాఫీగా తాండూరు కౌన్సిల్ సమావేశం

● పలు అభివృద్ధి పనులకు ఆమోదం

తాండూరు : జనవరి 31 : మున్సిపాలిటీకి చెందిన 12 ఖాళీ స్థలాల రక్షణ కోసం రూ. కోటి 77 లక్షల వ్యయంతో ఫెన్సింగ్ ఏర్పాటు, రూ. కోటి 80 లక్షల వ్యయంతో 9 మున్సిపాలిటీ పార్కుల అభివృద్ధికి కౌన్సిల్ ఆమోదం తెలిపింది. బుధవారం తాండూరు మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో చైర్‌పర్సన్ స్వప్న పరిమళ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. సమావేశంలో 24 అంశాలు చర్చకు రాగా 20 అంశాలను కౌన్సిల్ సభ్యులు ఆమోదించారని అధికారులు తెలిపారు. మున్సిపల్ కార్యాలయం ఆవరణలో తుది దశలో ఉన్న భవన పనులు పూర్తి చేయడానికి రూ.కోటి 15 లక్షలు అంచనాలను కౌన్సిల్ ఆమోదించింది. 34వ వార్డులోని మున్సిపల్ ఖాళీ స్థలంలో అంగన్‌వాడీ భవన నిర్మాణం చేపట్టుటకు కౌన్సిల్ పరిపాలన ఆమోదం తెలిపింది. పట్టణంలోని ఖాళీ స్థలాలు కబ్జా అవుతున్నాయని, అనుమతి లేని



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

నిర్మాణాలు పెరిగిపోతున్నాయని కౌన్సిలర్లు అన్నారు. ఆక్రమణలను ఆపేందుకు చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్లు డిమాండ్ చేశారు.ఎన్‌టీఆర్ కాలనీలో ఖాళీ స్థలాలు కబ్జాకు గురయ్యాయని స్థానిక కౌన్సిలర్ మమత, గొల్ల చెరువు కబ్జా గురైందని, మినీ ట్యాంకు బండ్ పనులు జరుగలేదని కౌన్సిలర్ లలిత, వైస్‌చైర్‌పర్సన్ దీపా కోరారు. పార్కులలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కౌన్సిలర్‌లు మంకాల రాఘవేందర్, శోభారాణి కోరారు. శాంతినగర్ పార్కులలో జరుగుతున్న అక్రమాలపై దృష్టి పెట్టి అవసరమైతే కేసులు పెట్టాలని కౌన్సిలర్లు విజయదేవి, అబ్దుల్ రజాక్ అధికారులకు చెప్పారు. వీధిదీపాలు ఏర్పాటుకు, కుక్కల బెడద నిర్మూలనకు, సానిటేషన్ పనులు మెరుగుపర్చుటకు చర్యలు తీసుకోవాలని కౌన్సిల్ సభ్యులు కోరారు. 20వ వార్డులో ఖాళీ స్థలం రక్షణకు చర్యలు తీసుకోవాలని, పని చేస్తూ చనిపోయిన ఇద్దరు కార్మికుల కుటుంబ సభ్యులను పనిలోకి తీసుకోవాలని కౌన్సిలర్ సంగీత ఠాకూర్ కోరారు. వైస్‌చైర్‌పర్సన్ దీపా నర్సింహులు, కమిషనర్ అహ్మద్ షఫీ ఉల్లా, మేనేజర్ నరేందర్‌రెడ్డి, డీఈఈ ఖాజాహుసెన్, పాల్గొన్నారు.

ప్రజా ఎజెండాపైనే చర్చ జరగాలి .. ఎమ్మెల్యే

నాలుగేళ్లు ఏం జరిగిందనే విషయాన్ని పక్కన బెట్టి మిగిలిన ఎడాదికాలం అభివృద్ధి ఏ విధంగా చేద్దామనే విషయంపై దృష్టి పెట్టాలని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజా ఎజెండా పైనే చర్చ జరగాలని కోరారు. కౌన్సిల్‌లో ప్రతిపక్షం, అధికారపక్షాలు ప్రజల పక్షం ఉండి పని చేయాలని చెప్పారు. బల్దియాలో రాజకీయాల వల్ల అభివృద్ధి కుంటు పడిందని అన్నారు.

బీఆర్ఎస్ హయాంలో గ్రామాల అభివృద్ధికి పెద్దపీట

●పిల్లలకు పౌష్టికాహారాన్ని అందించాలి

●జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, మాజీ మంత్రి ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

కందుకూరు, జనవరి 31 : గ్రామాల అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేసిందని మాజీ మంత్రి పి.సబితాఇంద్రారెడ్డి గుర్తుచేశారు. బుధవారం మండలంలోని మాదాపురం, గూడూరు గ్రామాలలో రూ.2కోట్ల 66 లక్షల నిధులతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను జడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డితో కలిసి ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. అనంతరం గూడూరులో ఏర్పాటు చేసిన సభలో సబితాఇంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక అన్ని రంగాల్లో తెలంగాణ అభివృద్ధి చేందిందని, విద్యారంగానికి మాజీ సీఎం కేసీఆర్ పెద్దపీట వేసినట్లు తెలిపారు. తమ పార్టీ నాయకులను విమర్శించడం మాని ప్రజలకు సంక్షేమ పథకాలను మంజూరు చేయడానికి కృషి చేయాలని కాంగ్రెస్ నాయకులకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు, అంగన్‌వాడి పిల్లలకు పౌష్టికాహారం అందించాలని అధికారులకు సూచించారు. గూడూరు ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల వద్దకు వెళ్లి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, ఎంపీపీ మంద జ్యోతి వైఎస్‌ఎంపీపీ గంగుల శమంతప్రభాకర్‌రెడ్డి, మహేశ్వరం మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్ సురేందర్‌రెడ్డి, సహకార సంఘం చైర్మన్ డి.చంద్రశేఖర్, మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు ఎస్ రాజశేఖర్‌రెడ్డి, సర్పంచ్‌లు మంద సాయిలు, పి.శ్రీలతశ్రీహరి, గోవర్ధన్, నరేందర్‌గౌడ్, ఎంపీటీసీలు ఎస్ ఎల్లారెడ్డి, కాకి రాములు, టి.ఇందిరదేవేందర్, నాయకులు మేఘనాథ్‌రెడ్డి, కాకి దశరథ, లచ్చానాయక్, బాబయ్య, పారిజాత , బర్కం వెంకటేష్, కె.ప్రశాంత్‌చారి, కార్తీక్, దీక్షత్‌రెడ్డి, రామక్రిష్ణ, కె.విఘ్నేశ్వర్ రెడ్డి, కొండల్‌రెడ్డి, సామయ్య, డికెఆర్, ఎండి అలీ ఖాన్, నవీన్‌కుమార్, పాల్గొన్నారు.

'పల్లెప్రగతి'తో గ్రామాభివృద్ధి

మహేశ్వరం : బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పల్లెప్రగతి కార్యక్రమాన్ని చేపట్టి గ్రామాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేశామని మాజీ మంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే పి. సబితాఇంద్రారెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని కేసీతండాలో రూ. 40 లక్షల నిధులతో నూతనంగా నిర్మించిన మినీ ఫంక్షన్‌హాల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మహేశ్వరం నియోజకవర్గానికి రావాల్సిన రూ.170 కోట్ల అభివృద్ధి నిధులను నిలిపేశారని చెప్పారు. అభివద్ధి పనులకు సంబందించిన బిల్లులు సర్పంచులకు రావాల్సి ఉందని ప్రభుత్వం ఆలోచించి పెండింగ్‌లో ఉన్న నిధులను విడుదల చేయాలన్నారు. ప్రతి తండాలో మినీ ఫంక్షన్‌హాల్ ఏర్పాటు చేసుకోవడానికి తనవంతు సహాయాన్ని అందిస్తానని చెప్పారు. ఫంక్షన్‌హాల్ ఆవరణలో ఎమ్మెల్యే మొక్కలు నాటారు. ఎంపీపీ ఆర్. సునిత అంద్యానాయక్, సర్పంచ్ మోతీలాల్, ఉపసర్పంచ్ లక్ష్మణ్, వార్డు సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.



కందుకూరు: మాదాపురంలో పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతున్న తీగల అనితారెడ్డి, సబితాఇంద్రారెడ్డి,

నామినేటెడ్ పోస్టుల్లో అవకాశమివ్వాలి

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ఏనుగు జంగారెడ్డి



కందుకూరు: సీఎంకు వినతి పత్రం ఇస్తున్న జంగారెడ్డి

కందుకూరు, జనవరి 31: రాష్ట్రస్థాయి నామినేటెడ్, కార్పొరేషన్‌ల చైర్మన్‌గా తనకు అవకాశం కల్పించాలని పీసీసీ సభ్యుడు ఏనుగు జంగారెడ్డి సీఎం రేవంత్‌రెడ్డికి బుధవారం నగరంలో వినతి పత్రం ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తాను విద్యార్థిదశ నుంచి కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పనిచేస్తూ పార్టీ అభ్యున్నతికి కృషి చేసినట్లు సీఎంకు తెలిపినట్లు, తనకు రాష్ట్రస్థాయి కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇవ్వాలని సీఎంను కోరినట్లు చెప్పారు. సీఎం సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పార్టీ మహేశ్వరం ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డితో కలిసి నియోజకవర్గ ప్రజలకు చేరవేయడానికి తనవంతు కృషిచేస్తానని చెప్పారు.

గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర కీలకం

● జెడ్పీ చైర్‌పర్సన్ సునీతామహేందర్‌రెడ్డి

మోమిన్‌పేట్, జనవరి 31 : గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌లు కీలక పాత్ర పోషించారని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సునీతామహేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని చిన్నకొల్కుంద గ్రామంలో సీసీరోడ్లు, కాలువల నిర్మాణం కోసం జడ్పీ వైస్‌చైర్మన్ విజయ్‌కుమార్‌తో కలిసి పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. ఐదేళ్ల క్రితం ఏర్పడ్డ ఈ గ్రామపంచాయతీకి మొదటి సర్పంచ్‌గా ఎన్నికైన సురేశ్ అభివృద్ధి కోసం కృషి చేశారని అభినందించారు. పదవీ కాలం నేటితో ముగుస్తుండడంతో ఇయనను సన్మానించారు. ఏఈ ప్రణీత, సుమిత్ర, సంగన్న, అశోక్, రాజు, నర్సింహులు, శివకుమార్, లక్ష్మయ్య, రాజయ్య, పాల్గొన్నారు.



చిన్నకొల్కుందలో శంకుస్థాపన చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ సునీతామహేందర్‌రెడ్డి, వైస్‌చైర్మన్ విజయ్‌కుమార్

ఇష్టారాజ్యంగా పార్కింగ్‌తో ప్రమాదాలు

● పట్టించుకోని అధికారులు



సుగణ ఫ్యాక్టరీ దగ్గర రోడ్డుకిరువైపుల నిలిచి ఉన్న వాహనాలు

పరిగి, జనవరి 31 : పరిగి-షాద్‌నగర్ రహదారిలో లక్ష్మీదేవిపల్లి గేట్ దగ్గర ఉన్న సుగుణ స్టీల్ ఫ్యాక్టర్ దగ్గర భారీ వాహనాలు నిలుపడంతో వాహనదారులకు ఇబ్బందికంగా మారింది. పలువురు ఈ రోడ్డుకిరువైపులా లోడ్‌తో ఉన్న వాహనాలు నిలుపుతుండడం వల్ల ఇబ్బందులు పడుతున్నామని వాహనదారులు వాపోతున్నారు. అడ్డదిడ్డంగా వాహనాలను నిలుపడం వల్ల ఈ ప్రాంతంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, ఈ ప్రాంతంలో రోడ్డు ప్రమాదాలు జరగడం వల్ల గతంలో పలువురు చనిపోయిన సంఘటనలు కూడా ఉన్నాయి. అయినా ఆ కంపెనీ యాజమాన్యం పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. పోలీసులు కూడా చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని విమర్శిస్తున్నారు. కంపెనీ యజమాన్యం నిర్లక్ష్యం వల్లే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని, కాషన్ బోర్డులు కూడా ఏర్పాటు చేయడం లేదని చెప్పారు. ఈ ప్రాంతంలో రాత్రి సమయంలో డ్రైవింగ్ చేయడం ఇబ్బందిగా ఉంటుందని, సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుపై వాహనాలు నిలుపకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రైతులకు ఉత్తమ సేవలు అందించాలి

●జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి



బ్యాంక్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్

వికారాబాద్, జనవరి 31 : రైతులకు ఉత్తమ సేవలు అందించేందుకు కృషి చేయాలని కోటక్ మహేంద్ర బ్యాంక్ అధికారులకు జిల్లా కలెక్టర్ సి నారాయణరెడ్డి సూచించారు. బుధవారం పట్టణ కేంద్రంలో కొటక్ మహేంద్ర బ్యాంక్ నూతన బ్రాంచ్‌ను జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికారాబాద్ జిల్లా వ్యవసాయాదారిత ప్రాంతమని, ఇక్కడి రైతులను ప్రోత్సహించే విధంగా బ్యాంకర్ల సేవలు ఉండాలని అన్నారు. జిల్లాలో చిన్న చిన్న పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చే ఔత్సాహికులను ప్రోత్సహించే విధంగా బ్యాంకు పనిచేయాలని చెప్పారు. లీడ్ బ్యాంకు మేనేజర్ రాంబాబు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాబుమోజెస్, రీజినల్ బిజినెస్ హెడ్ నటరాజ్ జోకే, క్లస్టర్ ఏరియా మేనేజర్ అనిల్‌పరిమి, జనరల్ మేనేజర్ రాఘవేంద్రగౌడ్, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

మూగజీవాలకు వ్యాధులు రాకుండా ముందస్తు టీకాలు

●పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ కృష్ణయ్య



మాట్లాడుతున్న ఏడీ కృష్ణయ్య

కందుకూరు, జనవరి 31: మూగజీవాలకు సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తు టీకాలు వేయాలని, రైతులకు నిత్యం అందుబాటులో ఉండాలని పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్(ఏడి) మండల పశు వైద్యాధికారులు, సిబ్బందికి సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక పశు వైద్య కేంద్రాన్ని ఆయన అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించిన అనంతరం పశువైద్యాధికారులు, సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులు, మూగజీవాల కోసం ప్రవేశ పెడుతున్న పథకాలపై రైతులకు, గొర్లకాపర్లకు అవగాహన కల్పించాలని చెప్పారు. పశువైద్యాధికారులు డాక్టర్ రేవతి, డాక్టర్ షాహిన్‌షేక్, డాక్టర్ సంధ్యారాణి, సిబ్బంది వసంత, సామయ్య, జంగయ్య, రమేష్, మాధవి, కదిర్, అప్సర్, అంజనేయులు పాల్గొన్నారు.

యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

● ఏసీపీ రాంచందర్‌రావు



మాట్లాడుతున్న ఏసీపీ రాంచందర్‌రావు

శంషాబాద్‌రూరల్, జనవరి 31 : యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని శంషాబాద్ ఏసీపీ రాంచందర్ రావు అన్నారు. బుధవారం మండల పరిధిలోని వర్ధమాన్ ఇంజనీరింగ్ కళాశాలలో యాంటీ డ్రగ్స్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఏసీపీ మాట్లాడుతూ.. యువత డ్రగ్స్‌కు బానిసలవుతున్నారని ఇది దేశానికి మంచిది కాదని చెప్పారు. యువత డ్రగ్స్‌కు బానిస కావడం దురదృష్టకరమన్నారు. యువత కేరీర్‌పై దృష్టి సారించాలని, పెంచి పోశించిన తల్లిదండ్రులు వారిపై ఎంతో అశ పెట్టుకుంటారని చెప్పారు. చెడు వ్యసనాలకు బానిస అయితే భవిష్యత్ అందకారంలో పడుతుందని హెచ్చరించారు. పలువురు యువత చెడు మార్గలను అనుసరిస్తున్నారని చెప్పారు. డ్రగ్స్ రహిత సమాజం కోసం కృషి చేయాలని సీఐ శ్రీనాథ్ పిలుపునిచ్చారు. డ్రగ్స్‌పై ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోందని, పోలీస్ శాఖ కూడ అదే రీతిలో స్పందిస్తోందని చెప్పారు. డ్రగ్స్ అమ్మే వారిపై పీడీ యాక్ట్ నమోదు చేస్తామన్నారు. కళాశాల సెక్రెటరీ ప్రభాకర్‌రెడ్డి, హనుమాన్‌రెడ్డి, ప్రిన్స్‌పాల్, ఎస్సై రాజ్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయ ఉత్తమ పారిశుధ్య కార్మికురాలు అవార్డును అందుకున్న లక్ష్మి



మోదీతో పారిశుధ్య కార్మికురాలు లక్ష్మి

కొడంగల్ రూరల్, జనవరి 31 : జాతీయ స్థాయి ఉత్తమ పారిశుధ్య కార్మికురాలిగా కొడంగల్ మండలంలోని హస్నాబాద్ పంచాయతీ కార్మికురాలు లక్ష్మి అవార్డును అందుకున్నారు. మంగళవారం ఢిల్లీలో ప్రధాని నరేంద్రమోదీ చేతుల మీదుగా ఆమె అవార్డును అందుకున్నట్లు సర్పంచ్ బి.పకీరప్ప తెలిపారు. ఈ సందర్భంగా లక్ష్మీని సర్పంచ్, పంచాయతీ సిబ్బంది, గ్రామస్థులు శుభాకాంక్షలు తెలిపి అభినందించారు.

15 నుంచి రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నమెంట్



టోర్నమెంట్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న మల్లురవి, ఎమ్మెల్యే కసిరెడ్డి

ఆమనగల్లు , జనవరి 31: శెట్టిపల్లి గ్రామంలోని శ్రీవెంకటేశ్వర స్వామి దేవాలయ బ్రహోత్సవాలను పురస్కరించుకుని ఫిబ్రవరి 15 నుంచి 17వరకు నిర్వహించే రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వహకులు ఎగిరిశెట్టి గోదాదేవిసత్యం తెలిపారు. టోర్నమెంట్‌కు సంబంధించిన గోడ పత్రికలను బుధవారం ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి డాక్టర్ మల్లు రవి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, జడ్పీ వైస్‌చైర్మన్ బాలాజీసింగ్ ఆమనగల్లులో ఆవిష్కరించారు. ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, యాట నర్సింహ్మా, శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, గుర్రం కేశవులు, వస్పుల జంగయ్య, జగన్, ఖాదర్‌ఖాద్రి, మానయ్య, కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ప్రసాద్, రాములు, కృష్ణానాయక్, రవిందర్‌నాయక్, అలీమ్, నాజర్, ఫరీద్, జంతుక యాదయ్య, దావ ధనంజయ్య, ఖలీల్, ఖాదర్, రహీమ్ ఉన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

తాండూరు రూరల్, జనవరి 31: తాండూరు పట్టణం, మండల పరిధి గ్రామాల లబ్ధిదారులు 253 మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి బుధవారం పంపిణీ చేశారు. మండల పరిషత్‌లో ఎంపీపీ ఎస్.అనితాగౌడ్, వైస్‌ఎంపీపీ స్వరూపలతో కలిసి రూ.2.53కోట్ల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ తారాసింగ్, డీటీ విజయేందర్, ఎల్మకన్నె ప్యాక్స్ ఎస్.రవీందర్‌గౌడ్, ఎంపీటీసీలు రాజ్‌కుమార్, శివకుమార్, నాయకులు వడ్డె శ్రీనివాస్, జనార్ధన్‌రెడ్డి, ఉత్తంచంద్, జర్నె నాగప్ప, ఆర్ఐలు బాల్‌రాజ్, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో ఘనంగా వార్షికోత్సవం

తాండూరురూరల్, జనవరి 31 : జినుగుర్తిలో గల కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో బుధవారం వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు కస్తూర్బ గాంధీ చిత్రపటానికి పూజలు నిర్వహించారు. అనంతరం బాలికలు పలు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. కార్యక్రమంలో మైనార్టీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ గంగయ్య, శ్రీనివాస్‌రెడ్డి, ప్రత్యేకాధికారి విజయరత్న, ఉపాధ్యాయులు, విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.


సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థినులు

విరమణ పదవులకే.. సేవకు కాదు


కందనెల్లిలో నూతన పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

పెద్దేముల్, జనవరి 31 : ప్రజాసేవలో ఉండే ప్రజాప్రతినిధులకు, రాజకీయ నాయకులకు పదవీ విరమణ అనేది తాత్కాలిక విరామం మాత్రమే అని.. కానీ ప్రజాసేవ నిరంతర ప్రక్రియని తాండూరు ఎమ్మెల్యే బి.మనోహర్‌రెడ్డి అన్నారు. ప్రజాసేవ నిరాఘాటంగా కొనసాగుతుందన్నారు. కందనెల్లిలో రూ20లక్షలతో నిర్మించిన పంచాయతీ భవనాన్ని బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంచాయతీల పాలకవర్గాల పదవీకాలం ముగిసినందున ఇప్పటి వరకూ పదవుల్లో ఉన్న వారు సేవల నుంచి విరమించినట్టు కాదన్నారు. పదవి ఉన్నా లేకున్నా ప్రజాసేవ ఎవరైనా చేయొచ్చని, పదవులనేవి అలంకరణ మాత్రమే అని మనోహర్‌రెడ్డి అన్నారు. ప్రజాసేవలో నాయకులకు పదవులు వస్తుంటాయి, పోతుంటాయి ఉంటాయని చెప్పారు. కాగా కందనెల్లిలో త్వరలోనే సబ్‌స్టేషన్ నిర్మిస్తామన్నారు. పాఠశాలలోనూ సమస్యల పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. తాగునీటి సమస్యలు తలెత్తనీయం అని అన్నారు. ఈ సందర్భంగా పంచాయతీ సభ్యులను ఎమ్మెల్యే సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ధారాసింగ్, సర్పంచ్ మోహన్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ మధులత, నారాయణరెడ్డి, మహిపాల్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, కిరణ్‌కుమార్, రాధాకృష్ణారెడ్డి, మహేష్, జావెద్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధి బాధ్యత నాదే ..

తాండూరు రూరల్: నియోజకవర్గంలోని గ్రామాల అభివృద్ధి బాధ్యత తనదని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. ఓగీపూర్‌లో నూతన పంచాయతీ భవనాన్ని ఎంపీపీ అనితారవీందర్‌గౌడ్, సర్పంచ్ పద్మమ్మతో కలిసి ఆయన ప్రారంభించారు. మన నియోజకవర్గం సీఎం సొంత జిల్లాలో ఉన్నందున ఎక్కువ నిధులు తెచ్చి అభివృద్ధికి పాటుపడతానన్నారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణం, కమ్యూనిటీ, డ్వాక్రా భవనాలు నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సుదర్శన్‌రెడ్డి, ఎంపీవో రతన్‌సింగ్, పీఆర్ డీఈ వెంకట్‌రావు, ఏఈ నందిని, ప్యాక్స్ చైర్మన్ ఎస్.రవీందర్‌గౌడ్, మాజీ ఎంపీపీ శరణబసప్ప, ఎంపీటీసీలు రాజ్‌కుమార్, శివకుమార్, నాయకులు వడ్డె శ్రీనివాస్, జనార్దన్‌రెడ్డి, ఉత్తంచంద్,హర్షవర్ధన్‌రెడ్డి, నర్సింహులు, నాగప్ప, మహిపాల్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, రాంచంద్రారెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.


ఎమ్మెల్యేను, పాలకవర్గాన్ని సన్మానిస్తున్న ఓగీపూర్ గ్రామస్తులు

పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి

శామీర్‌పేట, జనవరి 31 : పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని సెకండరీ గ్రేడ్ టీచర్స్(ఎస్‌జీటీ) అసోసియేషన్ డిమాండ్ చేసింది. తూంకుంట ప్రాథమిక పాఠశాలలో బుధవారం ఉమ్మడి మండల ఎస్జీటీలు సమస్యలపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. టీచర్లు మాట్లాడుతూ.. డీఏ, పీఆర్సీ ఎరియర్స్, ఇతర అన్ని పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని, పీఆర్సీలో ఎస్ఏ, ఎస్జీటీల వేతన వ్యత్యాసాన్ని తగ్గించాలని, వెంటనే పదోన్నతులు, బదిలీలు ప్రక్రియను చేపట్టాలని డిమాండ్ చేశారు. టీచర్లు రవీంద్రచారి, సంజీవ, సత్యం, రాజు, హరిశంకర్, యూనియన్ల బాధ్యులు తిరుమలేష్, మహేష్ కుమార్, షకీల్‌రెడ్డి, రాజ్‌కుమార్,రమేష్, కరుణశ్రీ, కల్పన, శైలజ, పుష్పలత పాల్గొన్నారు.


రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న టీచర్

ఫోర్త్‌క్లాస్ ఎంప్లాయీస్ క్యాలెండర్ ఆవిష్కరణ



వికారాబాద్, జనవరి 31: కలెక్టరేట్‌లో బుధవారం కలెక్టర్ సి.నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్లు రాహుల్‌శర్మ, లింగ్యానాయక్ తెలంగాణ నాల్గో తరగతి ఉద్యోగ సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అధికారి అమరేందర్ కృష్ణ, సంఘం జిల్లా ప్రెసిడెంట్ అక్బర్, కార్యదర్శి వెంకటయ్య, నాయకులు బాలకృష్ణ, సి.సతీష్‌కుమార్, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులను గుర్తించడం హర్షణీయం

బొంరాస్‌పేట్, జనవరి 31: గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా ఎంపికైన కోదండరాంను తెలంగాణ విద్యావంతుల వేదిక వికారాబాద్, ఉమ్మడి పాలమూర్ జిల్లాల ప్రతినిధులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లో కోదండరాం నివాసంలో విస్తృతస్థాయి సమావేశంలో టీవీవీ రాష్ట్ర కార్యదర్శి రవీందర్‌గౌడ్, జిల్లా అధ్యక్షుడు వెంకట్రాములు, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, కార్యదర్శులు గోపాల్, అనిల్‌కుమార్, రాష్ట్ర ప్రతినిధులు లక్ష్మి, విజయలక్ష్మి సుమరంజిత, మాధురి, శోభారాణి, బాలమణి, సదానందం, బసిరెడ్డి, అంజిలప్ప పలు విషయాలపై మాట్లాడారు. ఉద్యమకారుల ఆత్మగౌరవానికి, అమరవీరుల కుటుంబాలకు ప్రభుత్వం గుర్తింపు ఇవ్వడం హర్షణీయం అన్నారు. నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతలతో మక్తల్-నారాయణపేట, కొడంగల్, బొంరాస్‌పేట్, తాండూర్, పరిగి ప్రాంతాలకు సాగునీరందేలా కృషిచేయాలని, కాగ్నా నీటిని తాగునీటికి ఉపయోగించేలా చూడాలని, కాకరవాణి ప్రాజెక్టుపై ముఖ్యమంత్రితో చర్చించాలని కోరారు.


కోదండరాంతో టీవీవీ నాయకులు

మంత్రిని కలిసిన సందీప్‌రెడ్డి



ఘట్‌కేసర్ రూరల్, జనవరి 31 : తెలంగాణ రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని బుధవారం అవుషాపూర్‌నకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కందకట్ల సందీప్‌రెడ్డి కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. మండలంలో పార్టీ ఎలా ఉంది, ప్రభుత్వ పథకాల గురించి మంత్రి సందీప్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. పార్టీ బలోపేతానికి కాంగ్రెస్ శ్రేణులు పనిచేయాలని మంత్రి సూచించారు.

అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం


కులకచర్ల: బండవెల్కిచర్లలో పంచాయతీ భవనాన్ని ప్రారంభించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, పాల్గొన్న నాయకులు

కులకచర్ల, జనవరి 31:గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం బండవెల్కిచర్లలో నూతన పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామన్నారు. గ్రామస్తుల కోరిక మేరకు గ్రామంలో క్రీడా మైదానం ఏర్పాటు చేస్తామన్నారు.డ్రైనేజీ కాలువల నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తామన్నారు. అనంతరం పంచాయతీ సిబ్బందిని సన్మానించారు. అలాగే వారం రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఉపాధ్యాయుడు లక్ష్మారెడ్డి ఇంటికివెళ్లి ఆయన కుటుంబీకులను పరామర్శించారు. ఎమ్మెల్యే వద్ద టీచర్ భార్య శిరీష కన్నీరుమున్నీరయ్యారు. ప్రభుత్వపరంగా ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ సత్యహరిచంద్ర, జడ్పీటీసీ రాందాస్ నాయక్, పీఆర్ డీఈ లక్ష్మయ్య, డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, ఎంపీటీసీలు జ్యోతిలక్ష్మి, శ్రీనివాస్‌గౌడ్, ఆనందం, ఎంపీడీవో నాగవేణి, ఎంఈవో హబీబ్ అహ్మద్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీఎస్ ఆంజనేయులు, కార్యదర్శి గోపాల్‌నాయక్, బ్లాక్-2 అధ్యక్షుడు భరత్‌కుమార్, మాజీ ఎంపీపీ అంజిలయ్యగౌడ్, నాయకులు న్యాయవాది బాలముకుందం, వెంకటయ్యగౌడ్, బాచిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పలు పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

దోమ: దొంగ ఎన్కెపల్లి(సంజీవనగర్)లో పంచాయతీ భవన నిర్మాణానికి, క్రీడా ప్రాంగణానికి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధికి అవసరమైన నిధులను ప్రభుత్వం ద్వారా మంజూరు చేయిస్తానన్నారు. ఈ గ్రామం పేరును గెజిట్‌లో సంజీవనగర్‌గా మార్పిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ అనసూయ, సర్పంచ్ అశోక్‌రెడ్డి, ఎంపీటీసీ జంగారెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి, నాయకులు యాదవరెడ్డి, అనంతయ్య, శాంతకుమార్, అధికారులు పాల్గొన్నారు.

అధికారులు ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తేనే అభివృద్ధి

మోమిన్‌పేట్, జనవరి 31: అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి సమన్వయంతో పని చేసినప్పుడే గ్రామాల అభివృద్ధి జరుగుతుందని ఎంపీపీ వసంతవెంకట్ అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో చివరి సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా పరిషత్ వైస్‌చైర్మన్ బి.విజయ్‌కుమార్ హాజరయ్యారు. సమస్యలను పరిష్కరిస్తేనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో ఎన్నో సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు చేశారని తెలిపారు. గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు ప్రముఖ పాత్ర పోషించడంతో తెలంగాణ రాష్ట్రానికి 8 ఉత్తమ పంచాయతీ అవార్డులు వచ్చాయన్నారు. వాటిలో చీమలదరి ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందడం శుభపరిణామం అన్నారు. సర్పంచ్‌ల పదవీ కాలం ముగియడంతో పనులకు అధికారులు బిల్లులు అందించాలన్నారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ మానస, ఎంపీటీసీ డి.శ్రీనివాస్‌రెడ్డి, ప్యాక్స్ చైర్మన్ బి.విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీడీవో శైలజారెడ్డి, తహసీల్దార్ మనోహరచక్రవర్తి, పాల్గొన్నారు.

సమస్యలు పట్టించుకోని కార్యదర్శి

- ఎంపీడీవో ఆఫీసు వద్ద కొత్లాపూర్ వాసుల నిరసన

బషీరాబాద్, జనవరి 31: గ్రామంలో నెలకొన్న సమస్యలపై పంచాయతీ కార్యదర్శి అమృతప్ప పట్టించుకోవడం లేదని ఎంపీడీవో కార్యాలయం వద్ద కొత్లాపూర్ వాసులు బుధవారం నిరసన వ్యక్తం చేశారు. క్రీడా ప్రాంగణం స్థలంపై కార్యదర్శికి పట్టింపు లేకుండా పోయిందని, ఏ సమస్యా పట్టించుకోవడంలేదన్నారు. ఈ కార్యదర్శి తమకొద్దని నినాదాలు చేశారు. ఎంపీడీవో వచ్చి సమస్యలను విన్నారు. సర్పంచ్ రవినాయక్‌తో మాట్లాడారు. గ్రామానికొన్ని సమస్యలను పరిష్కరిస్తానని చెప్పగా గ్రామస్తులు వెళ్లిపోయారు.

నైపుణ్యాన్ని మెరుగు పరుచుకోవాలి


బహుమతులు అందజేస్తున్న డీఎస్పీ, జెడ్పీటీసీ

పెద్దేముల్, జనవరి 31 : విద్యార్థులు తమలోని నైపుణ్యాన్ని మెరుగుపరుచుకుంటే ప్రపంచం మీగుప్పిట్లో ఉంటుందని తాండూరు డీఎస్పీ శేఖర్‌గౌడ్ సూచించారు. పెద్దేముల్‌లో జడ్పీటీసీ ధారాసింగ్ పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన మండలస్థాయి క్రీడాపోటీలు బుధవారం ముగిశాయి. ముగింపు సమావేశానికి డీఎస్పీ శేఖర్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై పలు సూచనలు చేశారు. చదువురావడం లేదని బాధపడొద్దన్నారు. బద్ధకం దరిచేరనీయకుండా క్రమశిక్షణతో మెలగాలని తెలిపారు. కష్టపడితేనే ఏదైనా సాధిస్తారన్నారు. మంచి ఉద్యోగం సంపాదించడం కూడా దేశ సేవే అన్నారు. ఆర్థిక నిరక్షరాస్యత ఉండరాదని సూచించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ధారాసింగ్, న్యాయవాది ఎల్లారెడ్డి, లొంక నర్సిములు, కోఆప్షన్ సభ్యులు నసీర్, డీవై.నర్సిములు, గోపాలకృష్ణ, ఆనంద్‌చారి, పలువురు పీఈటీలు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడికి సన్మానం

మోమిన్‌పేట్, జనవరి 31: జిల్లా బీజేపీ నూతన అధ్యక్షుడు మాధవరెడ్డిని, అలాగే పాత అధ్యక్షుడు సదానందరెడ్డిని యువమోర్చా ఆధ్వర్యంలో బుధవారం సన్మానించారు. నాయకులు ఆశిరెడ్డి, మహిపాల్, రఘునాథ్‌రెడ్డి పాల్గొన్నారు.


బీజేపీ జిల్లా నూతన అధ్యక్షుడు మాధవ రెడ్డికి సన్మానం

పదవీ విరమణ చేసిన పాలకవర్గాలకు సన్మానం


కాచవానిసింగారంలో పాలకవర్గాన్ని సన్మానిస్తున్న పీఎస్ వేణుగోపాల్‌రెడ్డి

ఘట్‌కేసర్ రూరల్, జనవరి 31: ఐక్యతతో ఉంటేనే గ్రామాలు అభివృద్ధి సాధిస్తాయని కాచవానిసింగారం సర్పంచ్ కొంతం వెంకట్‌రెడ్డి అన్నారు. కాచవానిసింగారం, ఘనాపూర్ గ్రామాల్లో బుధవారం పంచాయతీ పాలకవర్గాల వీడ్కోలు సమావేశాలు నిర్వహించారు. కార్యదర్శి వేణుగోపాల్ రెడ్డి సర్పంచ్, వార్డు సభ్యులకు శాలువాలు కప్పి, జ్ఞాపికలు అందజేసి సన్మానించారు. వైఎస్ ఎంపీపీ జంగమ్మ, ఉపసర్పంచ్ గీతాముత్యం, వార్డు సభ్యులు శ్యామ్, నవీన్, మట్ట విష్ణుగౌడ్, లలిత, లక్ష్మీశ్రీ, అరుణ, రజిత, సంధ్య, సుదర్శన్, మహేష్, కో-ఆప్షన్ సభ్యులు ఆంజనేయులు, భద్రారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు. ఘనాపూర్‌లో పంచాయతీ సభ్యులను కార్యదర్శి సునీత సన్మానించారు. సర్పంచ్ గోపాల్ రెడ్డి మాట్లాడుతూ.. అభివృద్ధిలో తనకు సహకరించిన వార్డు సభ్యులకు ధన్యావాదాలు తెలిపారు. ఎంపీటీసీ రవి, వార్డుసభ్యులు పరమేష్‌గౌడ్,భాస్కర్, పద్మ, కాంతమ్మ, పవన్, శోభ, శేత, కో-ఆప్షన్ మెంబర్ సురేష్, ఇన్నారెడ్డి, లతారెడ్డి పాల్గొన్నారు.

బొంరాస్‌పేట్: చౌదర్‌పల్లి సర్పంచ్ దోమ వెంకటమ్మ, వార్డు మెంబర్లను గ్రామస్థులు సన్మానించారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ శేరి నారాయణరెడ్డి, ఉపసర్పంచ్ మధుసూదన్‌రెడ్డి, వార్డు సభ్యులు తుల్జారెడ్డి, కృష్ణయ్య శ్రీనయ్య మంజుల, సిబ్బంది యాదగిరి పాల్గొన్నారు.

బషీరాబాద్:బషీరాబాద్‌లో పంచాయతీ పాలకవర్గ వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీపీ కరుణఅజయ్‌ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సర్పంచ్ ప్రియాంక, వార్డు సభ్యులను స్థానికులు, వేర్వేరు గ్రామాల ప్రజాప్రతినిధులు, టీచర్లు, అధికారులు ఘనంగా సన్మానించారు. ఎంపీపీ మాట్లాడుతూ సర్పంచ్, వార్డు మెంబర్లు చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రేఖపవన్‌రాథూర్, నవాంద్గి ప్యాక్స్ వైస్ చైర్మన్ అజయ్ ప్రసాద్, ఎంపీడీవో రమేష్, వ్యాపారవేత్త దినేష్ పఠాని, నాయకులు వెంకటేష్, రజాక్, రామునాయక్, శంకరప్ప, రాజన్న, నరేష్‌చౌహాన్, పంచాయతీ కార్యదర్శి జయకర్, జూనియర్ అసిస్టెంట్ దశరథ్ తదితరులు పాల్గొన్నారు.


బషీరాబాద్ పంచాయతీలో సర్పంచ్ దంపతులను సన్మానిస్తున్న మండల నాయకులు

మూడుచింతలపల్లి: తన సర్పంచ్ పదవీ కాలంలో గ్రామాభివృద్ధికి కృషి చేశానని నాగిశెట్టిపల్లి సర్పంచ్ కృపాకర్‌రెడ్డి అన్నారు. గ్రామస్తులు పంచాయతీ సభ్యులను సన్మానించారు. ప్రత్యేకాధికారుల పాలనకు సహకరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ వైస్‌చైర్మన్ మధుకర్‌రెడ్డి, ఎంపీటీసీ హన్మంత్‌రెడ్డి, ఉపసర్పంచ్ శంకర్, వార్డు/కో-ఆప్షన్ సభ్యులు, పీఎస్ కార్యదర్శి సుచిత్ర పాల్గొన్నారు.

మేడ్చల్ టౌన్: సర్పంచ్ పదవీ కాలం పూర్తి చేసుకున్న మేడ్చల్ మండల డబిల్‌పూర్ సర్పంచ్ గీత భాగ్యరెడ్డిని ఎంపీపీ రజిత సన్మానించారు. సర్పంచ్, ఉపసర్పంచ్ సత్యనారాయణ, వార్డు సభ్యులను సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. డబిల్‌పూర్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేసేలా పాలక వర్గం కృషిచేసిందని ఎంపీపీ అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాజమల్లారెడ్డి, బాబుల్ రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు. అలాగే రాజబొల్లారం సర్పంచ్ మాంగ్యానాయక్‌తో పాటు పంచాయతీ వార్డు సభ్యులను స్థానికులు సన్మానించారు.


బొంరాస్‌పేట్: చౌదర్‌పల్లిలో సర్పంచ్, వార్డు సభ్యులను సన్మానిస్తున్న గ్రామస్తులు

తాండూరు రూరల్: తాండూరు మండలం బిజ్వార్‌లో సర్పంచ్ నరేందర్‌రెడ్డి పదవీ కాలం పూర్తయిన సందర్భంగా గ్రామస్తులు ఆయనను సన్మానించారు. ఐదేళ్ల పాటు గ్రామానికి ఎన్నో సేవలు చేశారని గుర్తుచేశారు. ఆయన సేవలు మరువలేనివని గ్రామస్తులు కొనియాడారు. అనంతరం మండల పరిధిలోని గోనూరు సర్పంచ్ గోవింద్, కోటబాస్పల్లి కుర్వ నాగార్జున, జినుగుర్తి గ్రామాల్లో సర్పంచ్‌లు బీడే నాగప్ప, కార్యక్రమంలో గ్రామ యువకులు పాల్గొన్నారు.


తాండూరు మండలం బిజ్వార్‌లో సర్పంచ్ నరేందర్‌రెడ్డికి జ్ఞాపికను అందజేస్తున్న గ్రామస్తులు


డబిల్‌పూర్ సర్పంచ్‌ను సన్మానిస్తున్న ఎంపీపీ రజిత, తదితరుల


నాగిశెట్టిపల్లి సర్పంచ్ కృపాకర్‌రెడ్డిని సన్మానిస్తున్న గ్రామస్తులు

క్రైం కార్నర్

మైనర్ ఆత్మహత్య

పూడూరు, జనవరి 31: అసలే మైనర్ బాలిక. ఆపై ప్రేమించుకున్నారని ఒప్పించి పెళ్లి చేశారు. కొన్ని రోజులు బాగానే ఉన్నా చివరకు బాలిక ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి ఎస్సై గిరి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మన్నెగూడకు చెందిన బాలిక(17), గొంగుపల్లికి చెందిన వెంకటేష్ ప్రేమ వివాహం చేసుకున్నారు. మొదట వీరి పెళ్లికి అమ్మాయి తరపువారు నిరాకరించారు. అబ్బాయి కుటుంబీకులు వారిని ఒప్పించడంతో రెండు నెలల క్రితం గొంగుపల్లి ఆలయంలో పెళ్లి చేశారు. దంపతులిద్దరూ కొన్ని నెలలు బాగానే ఉన్నారు. అయితే మంగళవారం రాత్రి అన్నం వడ్డించే విషయమై భర్త వెంకటేష్‌తో బాలికకు చిన్నపాటి గొడవైంది. మనస్థాపం చెందిన బాలిక పురుగుల మందుతాగింది. ఆమెను వికారాబాద్‌లోని మిషన్ ఆసుపత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందింది. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు భర్త, అతడి కుటుంబీకులపై కేసు నమోదు చేశామని ఎస్సై వివరించారు. కాగా బాలికను హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించారా? అనే కోణంలోనూ విచారణ చేస్తున్నట్టు ఎస్సై చెప్పారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి బలవన్మరణం

మర్పల్లి, జనవరి 31: ఆర్థిక ఇబ్బందులు, ఇతర సమస్యలతో ఓ వ్యక్తి ఉరేసుకున్నట్టు ఎస్సై శ్రీధర్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఘనపూర్‌కు చెందిన లింగంపల్లి రమేశ్(32)కు భార్య జ్యోతి ఉన్నారు. రమేశ్ ఆటోడ్రైవర్‌గా పనిచేసేవాడు.కొన్ని రోజుల క్రితం భార్య కాన్పు కోసం అని పుట్టింటికి వెళ్లింది. రమేశ్ తల్లిదండ్రుల వద్దే ఉండేవాడు. మంగళవారం ఆటో డ్రైవింగ్‌కు వెళ్లకుండా ఇంటి వద్దే దిగాలుగా ఉన్నాడు. రాత్రి తల్లిదండ్రులు, సోదరుడితో కలిసి భోజనం చేసి గదిలోకి వెళ్లాడు. తెల్లవారుజామున సోదరుడు అశోక్ గమనించగా రమేశ్ దూలానికి ఉరేసుకున్నారు. ఆర్థిక ఇబ్బందులు, ఇతర సమస్యలతో తన కొడుకు బాధపడేవాడని తల్లి సారమ్మ రోదించింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


ఉరేసుకున్న రమేశ్

అక్రమంగా కలప తరలిస్తున్న లారీల పట్టివేత

పూడూరు, జనవరి 31: అక్రమంగా కలప తరలిస్తున్న రెండు లారీలను పట్టుకున్నట్లు చెన్‌గోముల్ ఎస్ఐ గిరి తెలిపారు. మంగళవారం రాత్రి చీలాపూర్ గేటు వద్ద, మన్నెగూడ చౌరస్తా వద్ద పోలీసులు టి.నగేష్, శ్రీనివాస్ వేర్వేరుగా గస్తీ నిర్వహించారు. లారీల్లో(ఏపీ24 టీసీ1104), (టీఎస్34 టీబీ4043) అనుమతి లేకుండా కట్టింగ్ చేసిన కలప తరలిస్తున్నట్లు గుర్తించారు. దీంతో డ్రైవర్లు నవీన్, బోయ రవిలను, వాహనాలను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని ఆయన చెప్పారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అందజేత

మర్పల్లి, జనవరి 31: పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను సాంకేతిక పరిజ్ఞానంతో 24 గంటల్లో గుర్తించి యజమానులకు అప్పగిస్తామని ఎస్సై శ్రీధర్‌రెడ్డి తెలిపారు. వివిధ గ్రామాలకు చెందిన నలుగురు సెల్‌ఫోన్లు పోగొట్టుకొని పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. పోయిన మొబైల్ ఫోన్లను సాంకేతిక పరిజ్ఞానంతో కనిపెట్టి స్వాధీనం చేసుకున్నామన్నారు. బుధవారం యజమానులకు అప్పగించామన్నారు. ఎవరైనా సెల్‌ఫోన్ పోతే పీఎస్‌లో ఫిర్యాదు చేయాలన్నారు.



సంక్షిప్తంగా...

- **బొంరాస్‌పేట్:** మండలంలోని దుప్‌చర్లలో ప్రభుత్వ పాఠశాల శిథిలావస్థలో ఉందని, నూతన భవనాన్ని మంజూరు చేయాలని గ్రామస్థులు కడ అధికారి వెంకట్‌రెడ్డికి వినతి పత్రం అందించారు. బుధవారం క్యాంప్ కార్యాలయంలో అధికారికి వారు సమస్యలపై విన్నవించారు.
- **కులకచర్ల:** చౌడాపూర్ మండలం మందిపాల్ రైతులు తహసీల్దార్‌కు కొత్త పాసుపుస్తకాలు ఇవ్వాలని వినతిపత్రం అందించారు. సర్వే నెం.208లో 200ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, ఆ భూమిలో 141మంది రైతులు కాస్తులో ఉన్నారని తెలిపారు. విచారణ రైతులకు పాసుపుస్తకాలు అందించాలని కోరారు.
- **తాండూరు:** గణతంత్ర దినోత్సవ సందర్భంగా ప్రశంసాపత్రాలు అందుకున్న మున్సిపల్ డీఈఈ ఖాజా హుస్సేన్, మేనేజర్ నరేందర్‌రెడ్డిలను మున్సిపల్ కౌన్సిల్ ఘనంగా సన్మానించింది. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, చైర్‌పర్సన్ స్వప్న, వైస్ చైర్‌పర్సన్ దీప, కమిషనర్ అహ్మద్ షఫీ ఉల్లా, కౌన్సిలర్లు ప్రభాకర్‌గౌడ్, సంగీత, సోమశేఖర్, శోభారాణి, అస్లామ్, పూజ ఎర్రం వసంత, అశ్విని, రామకృష్ణ, లలిత, శ్రీలత, విజయాదేవి తదితరులున్నారు

కొడంగల్ రూరల్: హస్నాబాద్ పెద్ద చెరువు తూము నుంచి నీరు లీక్ అవుతోందని, తూముకు మరమ్మతులు చేయించాలని గ్రామస్థులు ఇరిగేషన్ అధికారులకు వినతి పత్రం అందించారు.

- **దోమ:** దళితబంధు నిధులు విడుదల చేయాలని దళితబంధు సాధన సమితి, అంబేడ్కర్ సంఘాల ఆధ్వర్యంలో దోమ ఎంపీడీవో జయరాంకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో దళితబంధు సాధన సమితి కో-కన్వీనర్ దత్తు, దళితబంధు సభ్యులు అంజిలయ్య, రమేశ్, కృష్ణయ్య, యాదయ్య, శివరాజ్, యాదమ్మ, నర్సిములు, అశోక్, అంజయ్య, కృష్ణయ్య, అంజిబాబు, యాదమ్మ, నర్సిములు, నరేశ్, జంగయ్య, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

కొడంగల్: కొడంగల్ మండలంలోని పాత కొడంగల్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు బుధవారం విహార యాత్రకు బయలుదేరి వెళ్లారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో గల పిల్లల మర్రి, మయూరి పార్కు, మన్యంకొండ, పిస్తాహౌస్ తదితర ప్రదేశాలను విద్యార్థులకు చూయించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఇ.క్రాంతికుమార్, ఉపాధ్యాయురాలు సంధ్య తెలిపారు.

- **తాండూరు:** కలెక్టర్ ఆదేశాల మేరకు తాండూరు పాత మున్సిపల్ కార్యాలయంలో గల మూడు ఆధార్ కేంద్రాలను ఈ నెల ఏడో తేదీ వరకు కొనసాగిస్తామని ఆర్డీవో శ్రీనివాసరావు తెలిపారు. పట్టణ, మండల ప్రజలు ఈ ఆధార్ కేంద్రాలను వినియోగించుకోవాలని కోరారు.
- **కులకచర్ల:** మండల టీఎస్-యూటీఎఫ్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ముజాహిద్‌పూర్ పాఠశాలలో జరిగిన సమావేశంలో వీరిని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా రమేశ్, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్, గౌరవ అధ్యక్షుడిగా రమేశ్ ఎన్నికయ్యారు.
- **కులకచర్ల:** కుష్టు వ్యాధిపై ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా మానిటరింగ్ అధికారి చంద్రప్రకాశ్ అన్నారు. ప్రభుత్వాసుపత్రిలో కుష్టువ్యాధి నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించి ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ నెల 13 వరకు గ్రామాల్లో ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి కుష్టు వ్యాధి లక్షణాలపై ప్రజలకు వివరిస్తూ సర్వే నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యురాలు మాధురి, సిబ్బంది రత్నలత, విజయలక్ష్మి, యాదమ్మ, షాజహన్, జంగమ్మ, చంద్రకళ, సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.
- **కొడంగల్:** దుద్యాల మండల చిలుముల్‌మైలారంలో శ్రీ గీతాజ్ఞాన గురుభక్త మండలి హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో శాంతియజ్ఞం, గీతాయజ్ఞం, గీతాపారాయణం, భక్తి ప్రవచనాలను రామబ్రహ్మానందస్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. కొడంగల్ నవీన ఆదర్శ కాన్వెంట్ విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు.
- **తాండూరు రూరల్/మర్పల్లి/యాలాల:** తాండూరు, యాలాల, మర్పల్లి మండలాల్లోని గ్రామ పంచాయతీలకు ప్రత్యేకాధికారులను కేటాయించారు. పంచాయతీల పాలకవర్గాల గడువు జనవరి 31తో ముగిసింది. దీంతో ప్రభుత్వం పంచాయతీలకు ప్రత్యేకాధికారులను నియమించింది. మళ్లీ ఎన్నికలు నిర్వహించే వరకు అధికారులే పంచాయతీ నిర్వహణ బాధ్యత చేపడుతారు.
- **ధారూరు:** తమవి దొంగ ఓట్లు కావని, బతుకు దెరువుకోసం ఇతర ప్రాంతాల్లో నివసిస్తున్నామని, కానీ వేరేచోట్ల ఓట్లు నమోదు చేయించుకోలేదని ఎబ్బనూర్‌లోని మైనార్టీ ఓటర్లు అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మకు ఫిర్యాదు చేశారు. తమవి దొంగ ఓట్లని ఫిర్యాదు చేసిన మాజీ సర్పంచ్‌పై రాజేందర్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామంలో 187 ఓట్లు దొంగఓట్లు అని మాజీ సర్పంచ్ సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.